# చాపకింద నీరులా డయేరియా !

- నీటి, ఆహార కాలుష్యాలే కారణమంటున్న వైద్యులు
- వర్షాకాలంలో అధికం, చిన్నారులపై తీవ్ర ప్రభావం
- నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలో పెరుగుతున్న రోగులు


ఫీవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

నల్లకుంట: రెండు రోజుల క్రితం వరకు నగర ప్రజలను ఎండలు బెంబేలెత్తించాయి. ప్రస్తుతం వాతావరణం కాస్తా చల్లబడినప్పటికీ ప్రజలను విష జ్వరాలు చుట్టుముట్టుతున్నాయి. ప్రధానంగా కలుషిత ఆహారం, నీటి కారణంగా డయేరియా విజృంభిస్తోంది. దీంతో ఫీవర్ ఆసుపత్రికి బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. మురికివాడల్లోని ప్రజలు పనులకు వెళ్లిన చోట కలుషిత నీరు తాగడం వల్లే జనం డయేరియా బారిన పడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

- వర్షాకాలంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే సీజనల్ వ్యాధుల ప్రభావం పెద్దలతో పాటు చిన్నారులపై తీవ్రంగా ఉంటుంది. చిన్నపిల్లల్లో వచ్చే డయేరియా (అతిసారం) ముఖ్యమైనది. దీనికి నీటి కాలుష్యం, ఆహార కాలుష్యం ముఖ్య కారణాలు. కాగా.. బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన వ్యాధి వ్యాప్తికి కారణం.
- ఎవరైనా ఓసారి డయేరియా బారినపడితే శరీరంలో ఉన్న లవణాలన్నీ బయటకు వెళ్లిపోయి శరీరం శుష్కించిపోతుంది. చిన్నారుల్లో దీని తీవ్రత మరింత ఎక్కువగా ఉంటుంది.
- వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే కిడ్నీలు దెబ్బతిని రోగి అపస్మారక స్థితికి చేరుకునే పరిస్థితి వస్తుంది. బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయవద్దని పదేపదే చెబుతున్నా ప్రజల్లో తగిన చైతన్యం రాకపోవడంతో ఓ రోగి నుంచి మరొకరికి ఈగల ద్వారా 'రాటా వైరస్ క్రిమి' వ్యాపిస్తుంది.
- ఈ వైరస్ ద్వారా ఆహార పదార్థాలు కలుషితమై వాటిని తిన్నవారు డయేరియాకు గురవుతారు. ప్రధానంగా పదేళ్లలోపు చిన్నారులు డయేరియాపై అప్రమత్తంగా ఉండాలని నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకర్ సూచిస్తున్నారు.

**ఫీవర్‌లో ఈ ఏడాది నమోదైన డయేరియా కేసుల వివరాలు..**

| | |
|---|---|
| జనవరి | 110 |
| ఫిబ్రవరి | 129 |
| మార్చి | 233 |
| ఏప్రిల్ | 167 |
| మే | 186 |
| జూన్ | 150 |

**నీటి కాలుష్యం ద్వారానే అధికం..**

డయేరియా వ్యాధి ఎక్కువగా నీటి కలుషితం ద్వారానే వస్తుంది. ఈ వర్షాకాలంలో తాగునీటి వనరులు, చెరువులు, రిజర్వాయర్‌లలో కలుషిత నీరుచేరి కుళాయిల ద్వారా అవే సరఫరా కావడంతో ఆ నీటిని తాగడంతో డయేరియా వ్యాధి వచ్చే అవకాశాలు ఎక్కువ.

- తాగునీటి పైపులు లీక్ అయినప్పుడు అందులో మురికి నీరు కలుస్తుంది. ఆ కలుషిత నీరు తాగడం వల్ల ఈ వ్యాధి వస్తుంది.
- 90 శాతం డయేరియాకు కలుషిత నీరే కారణమని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇక మిగిలిన 10 శాతం కలుషిత ఆహారం వల్ల సంక్రమిస్తుందని అంటున్నారు.
- గ్రేటర్ హైదరాబాద్‌లోని మురికివాడల్లో అధిక శాతం మంది పిల్లలు ఈ వర్షాకాలంలోనే డయేరియాకు గురవుతున్నట్లు తెలుస్తోంది.

**వ్యాధి కారకాలు..**

- కలుషితమైన నీటిని తాగడం.
- బయట దొరికే అపరిశుభ్ర ఆహార పదార్థాలను తినడం.
- ఆరుబయట మలవిసర్జన చేయడం.
- ఆహార పదార్థాలపై ఈగలు వాలడం ద్వారా కలుషితమవడం.
- మలవిసర్జన అనంతరం చేతులు శుభ్రంగా కడుక్కోకపోవడం.

**వ్యాధి గుర్తింపు..**

- తరుచూ వాంతులు, విరోచనాలు కావడం.
- నాలుక పిడచ కట్టుకుపోవడం, కళ్లు లోపలికి పోవడం.
- రోగి చర్మం సాగే గుణం కోల్పోవడం, రక్తపోటు పడిపోయి అపస్మారక స్థితిలోకి పోవడం.

**జాగ్రత్తలు, చికిత్సలు ఇలా..**

- డయేరియా వ్యాధితో బాధపడే చిన్నారులకు ఎక్కువగా విరోచనాలు కావడంతో వారి శరీరంలోని లవణాలన్నీ బయటకు వెళ్లిపోతాయి. దీంతో వారి శరీరంలోని నీరు, లవణాలు బయటకు వెళ్లిపోతాయి. దీంతో వారు డీహైడ్రేషన్‌కు గురై ప్రమాదానికి దారితీస్తుంది. తిరిగి శరీరానికి లవణాలను అందిస్తే వ్యాధి నుంచి ఉపశమనం పొందవచ్చు.
- పిల్లలు విరోచనాలతో లవణాలు నీరు కోల్పోయి శరీరం నీరసించిన పరిస్థితుల్లో పాలు, మజ్జిగ, కొబ్బరి నీళ్లు లాంటి పదార్థాలను క్రమం తప్పకుండా అందించాలి. విరోచనాలు ఎక్కువగా అవుతున్నాయని పిల్లలకు ఆహారం ఇవ్వకుండా మానివేయకూడదు. ఇలా చేస్తే పిల్లలు నీరసించి పోతారు.
- ఎక్కువగా విరోచనాలు అవుతున్న సమయంలో ఓఆర్ఎస్ ద్రవణాన్ని తప్పకుండా తాగించాలి. ఈ ద్రవాన్ని విరోచనం అయిన ప్రతీసారి తాగిస్తుంటే సమస్య రెండు రోజుల్లో అదుపులోకి వస్తుంది.
- కాచి చల్లార్చి వడకట్టిన నీటిలో చిటికెడు ఉప్పు, తగినంత పంచదార వేసి బాగా కలిపి పిల్లలకు ఇస్తుండాలి. ఇలా ఇవ్వడం వల్ల పిల్లలు వ్యాధి నుంచి ఉపశమనం పొందుతారు.

**నిర్లక్ష్యం వద్దు..**



డయేరియా వ్యాధిపట్ల ఎలాంటి నిర్లక్ష్యం వద్దు. చిన్నారుల్లో ఈ వ్యాధి లక్షణాలను గుర్తిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలి. లేదంటే మరింత అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంది. ఆహార నియమాలు, చిన్నపాటి జాగ్రత్తలతో వ్యాధిని నియంత్రించుకోవచ్చు.
– డాక్టర్ కె.శంకర్, ఫీవర్ సూపరింటెండెంట్

## క్లుప్తంగా

### నేడు అంబర్‌పేట్‌లో బీఎస్పీ కార్యాలయం ప్రారంభం

అంబర్‌పేట: నియోజకవర్గంలో బీఎస్పీ పార్టీ కార్యాలయాన్ని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రారంభించనున్నట్లు ఆ పార్టీ నియోకవర్గ నాయకులు సంజయ్‌చారి, జగన్‌లో శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తిలక్‌నగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ప్రవీణ్‌కుమార్ చేతుల మీదుగా నేడు ప్రారంభించనున్నారు. ఆదివారం ఉదయం జరిగే ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు పెద్దఎత్తున హాజరు కావాలని వారు కోరారు.

### నియామకం


వి.శ్రీనివాస్‌రెడ్డిని సత్కరిస్తున్న కార్మికులు, అభిమానులు

ముషీరాబాద్: తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో వి.శ్రీనివాస్‌రెడ్డి వరుసగా రెండోసారి విజయం సాధించారు. అంతకు ముందు ప్రముఖ కార్మిక నాయకుడు నాయిని నర్సింహ్మరెడ్డి గెలుపొందారు. శనివారం జరిగిన ఎన్నికల్లో హెచ్ఎంఎస్ తెలంగాణ బ్యానర్ మీద పోటీ చేసిన వి.శ్రీనివాస్‌రెడ్డి తన ప్రత్యర్థి ఐఎన్‌టీయూసీ కార్మిక నాయకుడు అబ్దుల్ ఖాదర్ మీద 9 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. కంపెనీలో మొత్తం 214 ఓట్లు ఉండగా హెచ్ఎంఎస్‌కు 107 ఓట్లు పోల్ అయ్యాయి. ఐఎన్‌టీయూసీకి 98 ఓట్లు, సీఐటీయూకి 9 ఓట్లు పోల్ అయ్యాయి. తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రటరీ అశోక్, నేత శ్రీనివాస్, సిరిగిరి శ్యామ్, కార్తీక్‌యాదవ్, వంశీ తదితరులున్నారు.

### 18 ఏళ్లు నిండిన వారు ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

కాచిగూడ: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్‌గా తమ పేర్లను నమోదు చేసుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఊక రాజు గుప్తా అన్నారు. శనివారం కాచిగూడ డివిజన్ కుద్బిగూడలో ఓటరు నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నూతన ఓటర్లతో పాటు ఓటరు కార్డులలో సవరణలు, చిరునామాల మార్పులు తదితర వాటిని కూడా మార్చుకునేందుకు వీలుంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రమేష్, రాజు, అశోక్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### అభివృద్ధి పనుల పర్యవేక్షణ



నల్లకుంట: డివిజన్ పరిధిలోని నర్సింహబస్తీలో రూ. 17.8 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన వాటర్ పైపులైన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు శనివారం బస్తీ అధ్యక్షకార్యదర్శులు ఎం.భూపతినాథ్, శ్రీనివాస్ పైపులైన్ పనులను పర్యవేక్షించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతాప్రమాణాలను పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

### నీటి కాలుష్యానికి పరిష్కారం


పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ కె.రవిచారి

ముషీరాబాద్: రాంనగర్ డివిజన్ రిసాలగడ్డలో చాలా రోజులుగా కలుషిత తాగునీటి సరఫరా అవుతోందని ఈ సమస్యపై స్థానిక కార్పొరేటర్ కె.రవిచారికి ఫిర్యాదు చేయగా.. ఆయన జలమండలి అధికారులతో కలిసి ప్రాంతాలను పరిశీలించారు. వారం రోజుల్లో సమస్య పరిష్కారమవుతుందని స్థానిక ప్రజలకు కార్పొరేటర్ హామీ ఇచ్చారు.

### వ్యాన్ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: వ్యాన్ ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. గుర్తుతెలియని వ్యక్తి (55) నింబోలిఅడ్డ మెయిన్ రోడ్డులో కుమార్ థియేటర్ సమీపంలో రోడ్డు దాటుతుండగా వ్యాన్ ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ.. శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గోవులను తరలించకుండా చెక్‌పోస్టుల ఏర్పాటు

చిక్కడపల్లి: బక్రీద్ సందర్భంగా గోవులను తరలించడాన్ని నిరోధించేందుకు చిక్కడపల్లి, గాంధీనగర్ పోలీస్ సబ్‌డివిజన్‌ల పరిధిలో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు చిక్కడపల్లి సబ్‌డివిజన్ ఏసీపీ, గాంధీనగర్ ఇన్‌చార్జ్ ఏసీపీ ఎ.యాదగిరి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీక్రాస్‌రోడ్స్, ముషీరాబాద్ చౌరస్తా, పోస్టాఫీస్, ఇందిరాపార్క్ చౌరస్తా, గాంధీనగర్ లింక్‌బ్రిడ్జి మొత్తం చిక్కడపల్లి పీఎస్ పరిధిలో ఒకటి, ముషీరాబాద్, గాంధీనగర్, పీఎస్‌ల పరిధిలో రెండు, మొత్తంగా 5 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. నిరంతరం పోలీస్ సిబ్బంది ఈ చెక్‌పోస్టుల వద్ద ఉండి గోవులను తరలించకుండా పర్యవేక్షిస్తారని ఆయన వివరించారు.

## చెక్‌పోస్టుల్లో అవినీతిపై ఏసీబీ అధికారులు దృష్టి సారించాలి

కాచిగూడ: వాహనాల్లో ఏదైనా ప్రభుత్వ ఉత్తర్వులను అతిక్రమించి చేస్తే నిస్సందేహంగా కేసులు రాసుకోవచ్చని.. అన్ని డాక్యుమెంట్లు సరిగ్గా ఉన్నా.. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు కొన్నిచోట్ల డబ్బులు ఇవ్వాలని ఇబ్బందులకు గురి చేస్తూ.. డ్రైవర్లను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని 'జై ఇండియన్ లారీ ఓనర్స్ అసోసియేషన్' జాతీయ అధ్యక్షుడు ముస్తాఫా అంబేద్కర్ ఆరోపించారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు కొన్నిచోట్ల లారీ డ్రైవర్లను భయభ్రాంతులకు గురిచేసి దాడులు చేసిన సందర్భాలు కూడా ఎన్నో ఉన్నాయన్నారు. ఆర్టీఓ బార్డర్లలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, అధికారులు ప్రభుత్వానికి లాభం చేయాల్సింది పోయి వీరి స్వలాభం కోసం లక్షల కొద్ది అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఏసీబీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

## మౌలిక సౌకర్యాల కల్పనకు కృషి


తాగునీటి పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్

అంబర్‌పేట: నియోజకవర్గ ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు నిరంతరాయంగా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. శనివారం అంబర్‌పేట డివిజన్ నరేంద్రనగర్‌లో రూ.6 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న తాగునీటి పైపులైన్ పనులను స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో కాలం చెల్లిన పైపులైన్ వ్యవస్థను దశలవారీగా ఆధునీకరిస్తున్నామన్నారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. జలమండలి అధికారులు, స్థానిక బీఆర్ఎస్ నాయకులు సిద్ధార్థముదిరాజ్, ఆంజనేయులు, మల్లేష్‌యాదవ్, ప్రవీణ్ పటేల్, జాకీ తదితరులున్నారు.

**గోల్నాకలో పర్యటన..**

ఖాద్రిబాగ్, అశోక్‌నగర్, గంగానగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, మ్యాన్‌హోళ్ల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

## నీటి సమస్య పరిష్కారానికి కృషి


నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

కవాడిగూడ: డీఎస్‌నగర్ ప్రజలకు వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా డీఎస్‌నగర్‌కు ఆనుకుని ఉన్న వరదనీటి నాలా ప్రహరీని నిర్మిస్తామని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. శనివారం భోలక్‌పూర్ డివిజన్‌లోని దామోదర సంజీవయ్యనగర్ (డీఎస్)లో నూతనంగా పవర్‌బోరింగ్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే, జలమండలి డీజీఎం కార్తీక్‌రెడ్డి, జీహెచ్ఎంసీ డీఈ సన్నీలతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డీఎస్‌నగర్‌లో నీటి సమస్య పరిష్కరించేందుకు బోరింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. డీఎస్‌నగర్‌లో పాదయాత్ర చేసి ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బీఆర్ఎస్ యువజన విభాగం నగర నాయకుడు ముఠా జైసింహ, భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్, డివిజన్ మాజీ అధ్యక్షుడు మహ్మద్‌అలీ, పార్టీ సీనియర్ నాయకులు రహీం, ముచ్చకుర్తి ప్రభాకర్, ముగ్బూల్, జబ్బార్, మున్వర్‌చాంద్, గోవింద్‌రాజ్ తదితరులున్నారు.

## పాఠశాలలు వదిలే వేళల్లో ట్రాఫిక్‌పై పోలీసులు దృష్టి సారించాలి

**ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ డిమాండ్**


సీ.హెచ్.రంగయ్య

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పాఠశాలలు వదిలే సాయంకాలం వేళల్లో రహదారులపై విపరీతమైన రద్దీతో వాహనకాలుష్యం పెరిగిపోతుందని ఈ విషయంపై వెంటనే ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించి రోడ్డు, ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించాలని ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ అధ్యక్షుడు సీ.హెచ్.రంగయ్య శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. స్కూళ్ల ప్రారంభం, వదిలే సమయాల్లో ఆయా స్కూల్ జోన్లపై పోలీసులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. గంటల తరబడి విద్యార్థులు ట్రాఫిక్‌లో చిక్కుకోవడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం లేకపోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఓ వైపు వాహన కాలుష్యం, మరోవైపు ధ్వని కాలుష్యం పర్యావరణానికి ప్రమాదకరమని ఈ సమస్యలపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే పాఠశాలలు వదిలే సమయాలను ట్రాఫిక్‌ను క్రమబద్ధం చేయాలని ఆయన కోరారు.

## ఆర్. కృష్ణయ్యకు సత్కారం

కాచిగూడ: వైఎస్ఆర్‌సీపీ ఆర్.కృష్ణయ్య రాజ్యసభ ఎంపీగా ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో విద్యానగర్‌లోని బీసీభవన్‌లో ఆయనను కలిసి ఘనంగా సత్కరించి అభినందించారు. బీసీల సంక్షేమం, అభివృద్ధి కోసం ఆయన అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా శనివారం కేక్‌కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. బీసీ సంక్షేమ సంఘం నేతలు రాజ్‌కుమార్, నీరడి భూపేష్‌సాగర్, నందగోపాల్, రామకృష్ణ రామరావు, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్: రాజ్యసభ ఎంపీగా నేటికి ఏడాది గడిచిన సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యను శనివారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఘనంగా సత్కరించారు. పార్లమెంటులో బీసీ బిల్లు సాధించే వరకు ఆయన పోరాటం చేస్తారని బీసీల హక్కుల కోసం ఉద్యమిస్తారని ఆకాంక్షించారు. బీసీ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ రాజ్‌కుమార్, గుజ్జ కృష్ణ, నందగోపాల్, భూపేశ్‌సాగర్, నిఖిల్‌పటేల్ తదితరులున్నారు.


ఆర్.కృష్ణయ్యను అభినందిస్తున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ


పూలమాలతో సత్కరిస్తున్న బీసీ సంఘం నేతలు

## ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి

**రాష్ట్ర ముదిరాజ్ సేవా సమాఖ్య డిమాండ్**

కాచిగూడ: సోషల్ మీడియా కెమెరామెన్ అజయ్ ముదిరాజ్‌పై దాడిచేసి బంధించి చిత్రహింసలు పెట్టడమే కాకుండా ముదిరాజ్‌లను కించపరుస్తూ.. అసభ్య పదజాలంతో దూషించిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డిపై తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముదిరాజ్ సేవా సమాఖ్య రాష్ట్రనేతలు పంజా మనోహర్‌ముదిరాజ్, బండి కృష్ణముదిరాజ్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నారాయణగూడలో వారు మాట్లాడుతూ.. ముదిరాజ్ జాతికి బహిరంగ క్షమాపణ చెప్పాలని అతడిని ఎమ్మెల్సీ పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కౌశిక్ రెడ్డిపై సుమోటాగా కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. క్షమాపణ చెప్పకుంటే రాష్ట్ర వ్యాప్తంగా నిరసన, ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ముదిరాజ్ సేవా సమాఖ్య ప్రతినిధులు అరుణ్‌కుమార్, శ్రీనివాస్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు


పనులను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ: అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని నాణ్యత లోపిస్తే కాంట్రాక్టర్‌పై చర్యలు తప్పవని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అధికారుకు తెలిపారు. శనివారం బర్కత్‌పుర హౌజింగ్‌బోర్డు కాలనీ పార్కులో ఏర్పాటు చేస్తున్న పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే స్థానికులు, అధికారులు, బీఆర్ఎస్ నేతలతో కలిసి పర్యవేక్షించారు. త్వరితగతిన పార్కులో అభివృద్ధి పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు, పార్కు అధ్యక్షుడు టి.శేషునారాయణ, బీఆర్ఎస్ నేతలు తదితరులున్నారు.

## ప్రభుత్వరంగ సంస్థలు నిర్వీర్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: గత 9 ఏళ్లుగా ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ.. కార్మిక హక్కులను కాలరాస్తున్నారని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ఆరోపించారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయకుండా 29 కార్మికచట్టాల స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చి కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. రైల్వే రక్షణ, ఫార్మా, సింగరేణి తదితర సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. ఏఐటీయూసీ నాయకులు ఎన్.బాలరాజు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఐదు కనీస వేతనాల జీవోలను అమలు చేసి షెడ్యూల్ పరిశ్రమలకు వెంటనే కనీస వేతన జీవోను ప్రకటించి అమలు చేయడంతో పాటు రైతాంగానికి కనీస మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఐఎఫ్‌టీయూ కార్యదర్శి కె.సూర్యం, ఎం.శ్రీనివాస్, టీఎంటీయూసీ నాయకులు ఎం.కే.బోస్, బీఆర్ఎస్‌కేవీ అధ్యక్షుడు రాంబాబుయాదవ్, హెచ్ఎంఎస్ నాయకులు ఆర్.రామారావు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## బీజేపీ ఇంటింటి ప్రచారం

కాచిగూడ: ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వ పథకాలతోనే బీజేపీకి ఆదరణ లభిస్తుందని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్ అన్నారు. శనివారం కాచిగూడ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి నరేంద్రమోదీ పథకాలతో కరపత్రాలను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలు బీజేపీని ఆదరిస్తున్నారన్నారు. బీఆర్ఎస్‌తో ప్రజలకు ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీజేపీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. బీజేపీ నేతలు రమేష్‌యాదవ్, భీమ్‌రాజ్, ప్రతిభ, విజయ్, కార్తిక్, ముఖేష్, సాయిరాజ్, సాయిదీపక్, కీర్తి, కిరణ్, ఆర్.సంతోష్, ఎస్.రవియాదవ్ తదితరులున్నారు.

## చేనేత వర్గాలకు సముచిత స్థానం కల్పించాలి

చిక్కడపల్లి: వచ్చే ఎన్నికల్లో చేనేత వర్గాలకు సముచిత స్థానం కల్పించాలని చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిక్కా దేవదాసు కోరారు. ఈ మేరకు శనివారం ఆయన ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా చేనేత వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు వివరించారు. కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, కత్తుల సుదర్శన్‌రావు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికప్రగతి సాధించాలి


క్విజ్ పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీపీసీసీ ప్రధానకార్యదర్శి కోట నీలిమ

కాచిగూడ: ప్రతి మహిళా స్వయం కృషితో ఆర్థికంగా ఎదగాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ అన్నారు. శనివారం బర్కత్‌పురలోని తెలంగాణ యువతి మండలి, ఎ.శ్యామలాదేవి బాలికల జూనియర్ కళాశాల వద్ద జులై 2న ఆన్‌లైన్‌లో నిర్వహించే రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీ పరీక్షలకు పేర్ల నమోదు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా క్విజ్ పోటీ పరీక్షల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది దేశ ఆర్థికవ్యవస్థలో కీలక పాత్ర పోషించాలన్నారు. ఆర్థికాభివృద్ధి, రాజకీయ స్థిరత్వం, సామాజిక పరివర్తనకు మహిళలు సాధికారత సాధించడం కీలకమని అది మహిళలకు విద్య ద్వారానే సాధ్యమవుతుందన్నారు. ఆన్‌లైన్ క్విజ్ పోటీలో పాల్గొనేందుకు పేర్లు నమోదు చేసుకున్న విద్యార్థులు ఈ- స్కూటర్, ల్యాప్‌టాప్, స్మార్ట్ ఫోన్, టాబ్లెట్స్ గెల్చుకునే అవకాశం ఉందన్నారు. 7661899899 నంబరుకు మిస్డ్‌కాల్ ఇచ్చి రిఫరల్ కోడ్ 15011 ఉపయోగించి పేర్లను నమోదు చేసుకోవాలని నీలిమ సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఐవీఎస్ హేమమాలిని, లెక్చరర్స్ సమత, రమ్యశ్రీ, అనురాధ దీక్షిత్, హరిప్రియ, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధానకార్యదర్శి అనుపశేఖర్, అఖిల్, భారత్, ఖుర్షీద్ తదితరులున్నారు.



## అన్ని వర్గాల అభివృద్ధికి కేంద్రం కృషి



కవాడిగూడ: దేశంలోని అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పార్టీ ఆశయాలు, సిద్ధాంతాల పట్ల ఆకర్షితులై నేవీ, ఆర్మీలో పనిచేసి రిటైర్డ్ అయిన ఉద్యోగులు బీజేపీలో చేరడానికి స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారన్నారు. శనివారం కవాడిగూడ డివిజన్ బండమైసమ్మ నగర్ కమ్యూనిటీహాల్‌లో కవాడిగూడ బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో మేధావుల సదస్సు నిర్వహించారు. నేవీ రిటైర్డ్ ఉద్యోగి కెప్టెన్ సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నేవీ రిటైర్డ్ ఉద్యోగులు పార్టీలో చేరగా డాక్టర్ కె.లక్ష్మణ్ వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్పొరేటర్ జి.రచనశ్రీ, రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి, ముషీరాబాద్ బీజేపీ కన్వీనర్ ఎం.రమేష్‌రాం, బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, ఓబీసీ మోర్చా నగర అధ్యక్షులు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, డివిజన్ బీజేపీ అధ్యక్ష, కార్యదర్శులు ఎంసీ మహేందర్‌బాబు, ఎ.ప్రభాకర్, కేశవరాజు, బీజేవైఎం నగర మాజీ అధ్యక్షుడు వినయ్‌కుమార్, నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ నవీన్‌గౌడ్, నాయకులు వెంకటస్వామి, పరిమళ్‌కుమార్, శ్రీనివాస్‌ముదిరాజ్, పీఎస్‌చారి, శ్రీనివాస్‌ముదిరాజ్, శివరాజ్, గంట శ్రీనివాస్, కుమార్‌గౌడ్, అనిల్, హరీష్‌గౌడ్, మోహన్‌సాయి పాల్గొన్నారు.

## 'ఉపా' చట్టాలతో ప్రజాస్వామ్యానికి విఘాతం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రజాస్వామ్య దేశంలో 'ఉపా' లాంటి చట్టాలు ఉండాల్సినవి కావని విద్యాపరిరక్షణ కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. విద్యారంగం పరిరక్షణ, విద్యారంగ అభివృద్ధి కోసం కావాల్సిన మౌలిక అవసరాలను తీర్చాలని ప్రభుత్వాలను ప్రశ్నించిన ఉపాధ్యాయులు, విద్యార్థులపై నమోదు చేసిన 'ఉపా' కేసులను తక్షణమే ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు. బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో హరగోపాల్ మాట్లాడారు. వివిధ విద్యార్థి సంఘాల నాయకులు మహేష్, రామకృష్ణ, ఆజాద్, అల్లూరి విజయ్, ఎం.ఎస్.కిష్టప్ప, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కాశీనాథ్ తదితరులున్నారు.